# వృత్తిదారుల జీవితాల్లో వెలుగులు

## లాండ్రీలు, సెలూన్లకు 250 యూనిట్ల ఉచిత కరెంట్

**సీఎం కేసీఆర్ చొరవతో ప్రతినెలా రూ.2వేల వరకు ఆదా**
**ఇస్త్రీ సులభమైందంటున్న రజకులు**
**హర్షం వ్యక్తం చేస్తున్న రజకులు, నాయీ బ్రాహ్మణులు**



సూర్యాపేట, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ) : సమైక్య పాలనలో రజకులతోపాటు నాయీబ్రాహ్మణుల జీవితాలు అంధకారంలో మగ్గేవి. కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో వారి కష్టాలకు బీఆర్ఎస్ ప్రభుత్వం చెక్ పెట్టింది. జిల్లాలో ఇస్త్రీ చేసే రజక కార్మికులతోపాటు నాయీబ్రాహ్మణులకు నెలనెలా 250 యూనిట్ల వరకు ఉచిత కరెంటు ఇస్తుండడంతో వారి జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయి. గతంలో ఇస్త్రీ చేసే వారికి బొగ్గు, కిరోసిన్ కోసం ప్రతి నెలా దాదాపు రూ.1200 నుంచి 1800 వరకు ఖర్చయ్యేది. నేడు తెలంగాణ సర్కారు వారికి ఉచిత విద్యుత్ ఇస్తుండడంతో ఆ ఖర్చు మిగిలి ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. నాయీబ్రాహ్మణులు కూడా తమ హెయిర్ సెలూన్లలో దాదాపు రూ.2 వేల విలువ చేసే విద్యుత్‌ను ఉచితంగా అందుకుంటున్నారు. జిల్లాలో రజకులు, నాయీబ్రాహ్మణ వృత్తిదారులు దాదాపు 4,600 మంది ఉండగా వారందరికీ కలిపి ప్రతి నెలా దాదాపు రూ.92 లక్షలు మిగులుబాటు అవుతున్నాయి.

ప్రజల మనసులో ఏముంది, వారు ఏమి కోరుకుంటారో తెలిసిన నాయకుడిగా సీఎం కేసీఆర్ ఆలోచన చేస్తూ 2014లో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్నీ చేస్తుండడంతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారు. తాగు, సాగునీటితోపాటు 24 గంటల విద్యుత్, రోడ్లు, పారిశుధ్యం, పచ్చదనం గణనీయంగా మెరుగుపడడంతోపాటు పంటలు సమృద్ధిగా పండుతున్నాయి. మరో పక్క ఎవరూ ఊహించని రీతిన పెరిగిన పింఛన్లు, రైతుబంధు లాంటి అనేక సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో అమలవుతుండడంతో ప్రజల మోములో ఆనందం ఉట్టిపడుతుంది. ఉమ్మడి పాలనలోని ప్రభుత్వాలు రజకులు, నాయీ బ్రాహ్మణులను ఏమాత్రం పట్టించుకోకపోగా, నేడు స్వరాష్ట్రంలో నెల నెలా 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందిస్తుండడంతో తమ వృత్తిని కొనసాగిస్తూ ఆనందంగా జీవిస్తున్నారు.

### విద్యుత్ భారం తప్పింది



గతంలో ఏ ప్రభుత్వాలూ కులవృత్తుల వారిని పట్టించుకోలేదు. కనీసం మాకు గుర్తింపు కూడా ఉండేది కాదు. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ అన్ని కులవృత్తుల వారికి అండగా ఉంటున్నారు. సెలూన్ షాపు కరెంటు కోసం ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీతో మాపై ఆర్థిక భారం తగ్గింది. గతంలో గిరాకీ ఉన్నా, లేకపోయినా కరెంటు బిల్లు, ఇతర ఖర్చులు తప్పేవి కాదు. తెలంగాణ ప్రభుత్వం వచ్చినంక కరెంటు బిల్లు కట్టాల్సిన పనిలేకుండా పోయింది. కులవృత్తిని నమ్ముకొని జీవిస్తున్న మాకు ప్రభుత్వం అండగా నిలిచింది. ప్రభుత్వ సహకారంతో షాపును సంతోషంగా నడుపుకుంటున్నా. మాకు ఆసరాగా నిలిచిన ప్రభుత్వానికి ఎల్లవేళలా రుణపడి ఉంటాం.

**–శ్రీరాముల జానయ్య, హెయిర్ సెలూన్ నిర్వాహకుడు, చివ్వెంల**

### రజకులను గుర్తించింది సీఎం కేసీఆరే



రాష్ట్రంలోని పేద రజకుల ప్రయోజనాల దృష్ట్యా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి సెలూన్ షాపుకు 250 యూనిట్ల కరెంటును ఉచితంగా ఇవ్వడం హర్షణీయం. గతంలో మేము ప్రతి రోజూ బొగ్గులు కొని వాటితో బట్టలు ఇస్త్రీ చేసేవాళ్లం. దాంతో బొగ్గు వాసన, పొగతో ఇబ్బంది పడేవాళ్లం. ముఖ్యమంత్రి కేసీఆర్ మాకు ఇస్త్రీ పెట్టతోపాటు ప్రతి నెలా 250 యూనిట్ల చొప్పున కరెంటు ఫ్రీగా ఇస్తుండడంతో రోజుకు రూ.600 నుంచి 700 సంపాదిస్తున్నాం. మమ్మల్ని గుర్తించి ఆదుకుంటున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అండగా ఉంటాం.

**–నారాయణదాసు శ్రీను, రజకుడు, తుంగతుర్తి**

### బొగ్గుల బాధ తప్పింది

మాది నిరుపేద కుటుంబం. చిన్నప్పుడే తండ్రి చనిపోయాడు. మా అమ్మ ఇంటింటికీ వెళ్లి బట్టలు ఉతికి కుటుంబాన్ని పోసించింది. ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో నా చదువు మధ్యలోనే ఆగిపోయింది. ఈ క్రమంలో మా అమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. కుటుంబం భారంగా మారింది. తప్పని పరిస్థితిలో ఇస్త్రీ చేయడం మొదలుపెట్టా. బొగ్గుల పెట్టెతో ఇస్త్రీ చేసేవాడిని. బొగ్గు కోసం నెలకు రూ.1,500 నుంచి 2,000 వరకు ఖర్చయ్యేది. మా బాధలు తెలుసుకున్న సీఎం కేసీఆర్ మాకు 250 యూనిట్ల వరకు ఉచిత కరెంటు ఇస్తుండడంతో బొగ్గు బాధ తప్పింది. ఖర్చు కూడా తగ్గింది. రజకులకు ఉచిత కరెంటు ఇస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు.

**– చింతల సైదులు, అనంతారం, పెన్‌పహాడ్**

### స్వరాష్ట్రంలోనే రజకులకు ప్రోత్సాహం



ఉమ్మడి పాలనలో ఏమాత్రం ఆదరణకు నోచుకోని మమల్ని స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ సారే మమ్మల్ని చేరదీశారు. రజక వృత్తిదారులకు 250 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ తోపాటు సబ్సిడీ రుణాలు అందించి మా కుటుంబాలకు అండగా నిలిచారు. గత ప్రభుత్వాల హయాంలో సరిగ్గా కరెంట్ కూడా ఉండేది కాదు. వృత్తిని మానేసి కూలికి వెళ్లాల్సి వచ్చేది. నేడు బీఆర్ఎస్ ప్రభుత్వంలో కరెంట్ కొరత లేదు. ప్రభుత్వం ఉచిత కరెంట్ అందిస్తుండడం ఎంతో మేలవుతుంది. నెల మొత్తం ఇస్త్రీ చేసినా 200 యూనిట్లకు మించి కరెంటు కాలట్లేదు. దాంతో కరెంట్ బిల్లుల సమస్యే ఉండట్లేదు. ఉచిత కరెంటు అందిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి ధన్యవాదాలు.

**–తాతరాజు దుర్గాప్రసాద్, రజకుడు, మఠంపల్లి**

### నెలకు రూ.92 లక్షలు లబ్ధి..

జిల్లాలో ఇస్త్రీ చేసే రజకులు, నాయీబ్రాహ్మణ కుటుంబాలు కలిపి 4,600 పైగానే ఉండగా వారందరికీ నెల నెలా 250 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను ప్రభుత్వం అందదిస్తున్నది. 2014కు ముందు ఇస్త్రీ చేసే రజకుల పరిస్థితిని ఎలా ఉండేదంటే వీధుల్లో చిన్నచిన్న గుడిసెలు వేసుకొని నానా తంటాలు పడుతూ బట్టలు ఇస్త్రీ చేసేవారు. బొగ్గు, కిరోసిన్‌కు దాదాపు నెలకు రూ.1,500 వరకు ఖర్చు అయ్యేది. ఆ ఖర్చులు పోను నెలకు రూ.2 నుంచి 3 వేల వరకు సంపాదించేవారు. నేడు వారికి నెలనెలా 250 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తుండడంతో బొగ్గు తిప్పలు తప్పాయి. కిరోసిన్ ఖర్చు లేదు. దాంతో నాడు అయ్యే ఖర్చు రూ.1,500లతోపాటు వారికి వచ్చే ఆదాయం రూ.3 వేలు కలిపి రూ.4,500 వరకు మిగులుతున్నాయి. ఇక హెయిర్ సెలూన్‌లకు కూడా నెల నెలా 250 యూనిట్ల వరకు విద్యుత్ ఇస్తుండడంతో వారికి కూడా ప్రతి నెలా రూ.2 వేల విద్యుత్ చార్జీలు మిగులుబాటు అవుతున్నాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు. సమైక్య పాలనలో ప్రభుత్వాల నుంచి ఎలాంటి చేయూతకు నోచని రజకులు, నాయీబ్రాహ్మణులు నేడు ఉచిత విద్యుత్ ద్వారా జిల్లాలోని సుమారు 4,600 కుటుంబాలు నెలకు రూ.92 లక్షల చొప్పున లబ్ధి పొందుతున్నారు. ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఎల్లవేళలా అండగా ఉంటామని చెబుతున్నారు.

---

**సీఎం కేసీఆర్ సభలు ఉన్న చోట సాదాసీదాగా..**
**సూర్యాపేటలో దాఖలు చేయనున్న మంత్రి జగదీశ్‌రెడ్డి**
**ఆయా నియోజకవర్గాల్లో నామినేషన్ వేయనున్న బీఆర్ఎస్ అభ్యర్థులు**

# నేడు బీఆర్ఎస్ అభ్యర్థుల నామినేషన్లు

## గులాబీ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీలు

నల్లగొండ ప్రతినిధి, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ) : ఓ వైపు ఎన్నికల ప్రచారం.. మరోవైపు పార్టీలో చేరికలపై దృష్టి సారించిన బీఆర్ఎస్ అభ్యర్థులు నామినేషన్ల దాఖలుపై దృష్టి సారించారు. గురువారం శుభ దినం కావడంతోపాటు అధినేత కేసీఆర్ కూడా నేడు నామినేషన్ దాఖలు చేయనున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లా పరిధిలోని అభ్యర్థులంతా తమ నామినేషన్లు వేసేందుకు సిద్ధమయ్యారు. నేడు ఉదయం 11నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్యలో నామినేషన్ వేసేలా ఏర్పాట్లు చేసుకున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థులతో పాటు ఆయా నియోజకవర్గాల్లోని కీలక నేతలంతా నామినేషన్ కార్యక్రమాల్లో భాగస్వాములు కానున్నారు. సూర్యాపేటలో మంత్రి జగదీశ్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేయనున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ శ్రేణులు, అభిమానులు స్వచ్ఛందంగా తరలి రానుండడంతో ఎస్వీ డిగ్రీ కళాశాల ఏరియా నుంచి పాదయాత్రగా వెళ్లి నామినేషన్ వేయనున్నారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులనుద్దేశించి మంత్రి ప్రసంగించనున్నారు. తుంగతుర్తిలో బీఆర్ఎస్ అభ్యర్థి గాదరి కిశోర్‌కుమార్ అర్వపల్లిలోని యోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నామినేషన్‌కు ఏర్పాట్లు చేశారు. ఎటువంటి హంగామా లేకుండా పార్టీ ముఖ్య నేతలతోనే నామినేషన్ వేయనున్నారు. హుజూర్‌నగర్ గణపతి ఆలయంలో పూజల అనంతరం భారీ ర్యాలీతో నామినేషన్‌కు ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి సిద్ధమయ్యారు. నామినేషన్ కార్యక్రమంలో పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా తరలి వచ్చి భాగస్వాములు కానున్నట్లు తెలిపారు. కోదాడలో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ బుధవారం భారీ ర్యాలీతో నామినేషన్ దాఖలు చేశారు. దీంతో కోదాడలో బీఆర్ఎస్ శ్రేణుల సందడి నెలకొంది. మిర్యాలగూడలో ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు నేడు నామినేషన్ వేయనున్నారు. ఎన్ఎస్పీ క్యాంపు గ్రౌండ్‌లోని అమరవీరుల స్థూపం నుంచి ర్యాలీగా ఆర్వో కార్యాలయం వరకు వెళ్లనున్నారు. నామినేషన్ అనంతరం పార్టీ శ్రేణులనుద్దేశించి ప్రసంగించనున్నారు. దేవరకొండలో ఎమ్మెల్యే రవీంద్రకుమార్ ఇప్పటికే సాదాసీదాగా రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. నేడు పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి భారీ ర్యాలీతో మరో సెట్ నామినేషన్ వేసేందుకు సిద్ధమయ్యారు. మునుగోడులో ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి నామినేషన్ దాఖలుకు ఏర్పాట్లు చేసుకున్నారు. స్వచ్ఛందంగా తరలివచ్చే పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి అంగడిపేట నుంచి భారీ ర్యాలీగా తరలివెళ్లి చండూరు తాసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ వేయనున్నారు.

### నేడు, రేపు కోలాహలం

నామినేషన్ల దాఖలుకు ఇవ్వాళ, రేపు మాత్రమే గడువు ఉంది. ఈ రెండ్రోజులు ప్రధాన పార్టీల అభ్యర్థులతోపాటు స్వతంత్రులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు వేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈరోజు, రేపు వేసేందుకు ప్లాన్ చేసుకున్నారు.

### సీఎం సభలు ఉన్న చోట సాదాసీదాగా..

నల్లగొండ జిల్లాలో పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ బహిరంగ సభలు ఉన్న నియోజకవర్గాల్లో సాదాసీదాగా నామినేషన్ల దాఖలుకు అభ్యర్థులు సన్నద్ధమయ్యారు. నల్లగొండలో ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ముఖ్య నేతలతో కలిసి నామినేషన్ వేయనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ నెల 20న అధినేత కేసీఆర్ బహిరంగ సభ ఉన్న నేపథ్యంలో ప్రస్తుతం సాదాసీదాగా నామినేషన్ వేయనున్నారు. నకిరేకల్‌లో ఈ నెల 20న కేసీఆర్ మీటింగ్ ఉండడంతో ఇక్కడ కూడా చిరుమర్తి లింగయ్య ఎటువంటి హడావుడి లేకుండా ముఖ్య నేతలతో కలిసి నామినేషన్ వేయాలని నిర్ణయించారు. నాగార్జునసాగర్‌లో ఈ నెల 14న అధినేత కేసీఆర్ బహిరంగ సభ ఉండగా.. నోముల భగత్‌కుమార్ సింపుల్‌గా నామినేషన్ వేయనున్నారు. పార్టీ ముఖ్యులతో కలిసి నిడమనూరు ఆర్వో కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఆలేరులో ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్ రెడ్డి శుక్రవారం అధికారికంగా హంగామా లేకుండా ముఖ్య నేతలతో కలిసి నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఇప్పటికే రెండు సెట్ల నామినేషన్లను సునీత తరపున పార్టీ నేతలు దాఖలు చేశారు.